సాక్షి
నిజామాబాద్

శుక్రవారం । 11 । ఏప్రిల్ । 2025



గౌరవప్రదంగా జీవించాలి

న్యాయ సేవాధికార సంస్థ అందిస్తున్న చేయూతతో గౌరవప్రదంగా జీవించాలని జిల్లా జడ్జి సునీత కుంచాల పేర్కొన్నారు.

- 8లో ▸



కొనుగోళ్లకు ఆటంకం

ధాన్యం కొనుగోళ్లకు అకాల వర్షాలు బ్రేక్ వేశాయి. గురువారం వర్షం కురవడంతో అరబెట్టిన ధాన్యం తడిసి ముద్దయ్యింది.

- 8లో ▸

వాతావరణం

గరిష్టం/కనిష్టం
42.6 /23.3

ఉదయం ఈదురుగాలులు వీస్తాయి. పగటి ఉష్ణోగ్రతలు పెరుగుతాయి. ఉక్కపోతగా ఉంటుంది. సాయంత్రం ఆకాశం పాక్షికంగా మేఘావృతమవుతుంది.

న్యూస్‌రీల్

పదకొండు రిజిస్ట్రేషన్‌లు



ఆర్మూర్‌టౌన్: ఆర్మూర్ పట్టణంలోని రిజిస్ట్రేషన్, స్టాంప్స్ కార్యాలయంలో గురువారం తెలంగాణ ప్రభుత్వం పైలెట్ ప్రాజెక్టు కింద ప్రతిరోజు 48 స్లాట్లను బుక్ చేసే కార్యక్రమాన్ని చేపట్టిందని రిజిస్ట్రేషన్, స్టాంప్స్ డీఐజీ రమేశ్ రెడ్డి పేర్కొన్నారు. పైలెట్ ప్రాజెక్టు కింద ఆర్మూర్ కార్యాలయంలో రెండు రిజిస్ట్రేషన్‌లను చేసి డాక్యుమెంట్లను వెంటనే సంబంధిత వ్యక్తులకు అందజేసినట్లు తెలిపారు. మొత్తం 11 స్లాట్‌లు బుక్ చేయగా, 11 రిజిస్ట్రేషన్‌లు చేసినట్లు తెలిపారు. ఇకపై రిజిస్ట్రేషన్ చేసుకునేవారు వారే డాక్యుమెంట్లను తయారు చేసుకొని స్లాట్ బుక్ చేసుకునే అవకాశాన్ని ప్రభుత్వం కల్పించిందన్నారు. ఈ అవకాశాన్ని ప్రజలు వినియోగించుకోవాలని కోరారు. కార్యక్రమంలో ఆర్మూర్ సబ్ రిజిస్ట్రేషన్ అధికారి మహేందర్ రెడ్డి, కార్యాలయ అధికారులు, డాక్యుమెంట్ రైటర్లు పాల్గొన్నారు.

దేగాం జీపీకి రాష్ట్రస్థాయి పురస్కారం



పెర్కిట్ : ఆలూర్ మండలం దేగాం గ్రామ పంచాయతీ రాష్ట్రస్థాయి పురస్కారానికి ఎంపికైంది. 2022–23 సంవత్సరానికి దేగాంలో అనేక అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టినందుకు కేంద్ర ప్రభుత్వం అందజేసే రాష్ట్రస్థాయి అవార్డుకు ఎంపికైనట్లు ఎంపీడీవో గంగాధర్ తెలిపారు. దేగాం గ్రామంలో శుభ్రత, పర్యావరణ పరిరక్షణ, మౌలిక సదుపాయాల కల్పన, మహిళ సాధికారత, జల వ్యవస్థాపన వంటి రంగాల్లో ఉత్తమ ప్రదర్శన కనబరిచినట్లు తెలిపారు. ఈ సందర్భంగా కార్యదర్శి శ్రీనివాస్‌ను ఎంపీడీవో సన్మానించారు. కార్యక్రమంలో కార్యదర్శులు రాజలింగం, దినేశ్, నవీన్, నసీర్, కిశోర్ తదితరులు పాల్గొన్నారు.



ఇంకెప్పుడో..!

వర్సిటీ ఏర్పడి 18 ఏళ్లు..

- ఇదీ తెలంగాణ విశ్వవిద్యాలయం పరిస్థితి
- పాలకుల నిర్లక్ష్య వైఖరితో సంప్రదాయ కోర్సులకే పరిమితం
- ఆదిలాబాద్, నిర్మల్ జిల్లాలను తెయూ పరిధిలోకి తెచ్చే విషయంలోనూ అదే తీరు..

తెలంగాణ వర్సిటీలో ఇంజినీరింగ్ కళాశాల ఏర్పాటు విషయమై పాలకుల్లో చిత్తశుద్ధి కరువైందని విద్యాభిమానుల్లో విమర్శలు వ్యక్తమవుతున్నాయి. 18 ఏళ్ల క్రితం 577 ఎకరాల్లో వర్సిటీ ఏర్పడింది. ప్రస్తుతం ఎంబీఏ, ఎంసీఏ, లా, ఇతర పీజీ కోర్సులు సహా మొత్తం 26 కోర్సులు ఉన్నాయి. భిక్కనూరు వద్ద సౌత్ క్యాంపస్, సారంగాపూర్ వద్ద బీఈడీ కళాశాల కొనసాగుతోంది.

సాక్షి ప్రతినిధి, నిజామాబాద్ : అత్యంత ప్రతిష్టాత్మకంగా రాష్ట్రం పేరుమీద ఏర్పాటు చేసిన తెలంగాణ విశ్వవిద్యాలయంలో ఇప్పటివరకు ఇంజినీరింగ్ కళాశాల లేదు. ప్రస్తుతం వర్సిటీ 18 ఏళ్లు పూర్తి చేసుకుని 19వ ఏడాదిలో కొనసాగుతోంది. 2006 సెప్టెంబర్‌లో దివంగత ముఖ్యమంత్రి, మహానేత డాక్టర్ వైఎస్ రాజశేఖర్‌రెడ్డి రాష్ట్రంలో ఏ వర్సిటీకి లేనివిధంగా 577 ఎకరాల్లో దీన్ని ఏర్పాటు చేయించారు. ప్రస్తుతం ఇందులో ఎంబీఏ, ఎంసీఏ, లా, ఇతర పీజీ కోర్సులు సహా మొత్తం 26 కోర్సులు ఉన్నాయి. తరువాత 2011లో భిక్కనూరు వద్ద 62 ఎకరాలతో సౌత్ క్యాంపస్ ఏర్పాటు చేశారు.

2016లో నిజామాబాద్ నగర శివారులోని సారంగాపూర్ వద్ద 65 ఎకరాల్లో వర్సిటీ బీఈడీ కళాశాల ఏర్పాటు చేశారు. ఇంతలా వర్సిటీ పెరుగుతూ వచ్చినప్పటికీ ఇప్పటివరకు ఇంజినీరింగ్ కళాశాల మాత్రం సాధించుకోలేకపోయింది. తెలంగాణ ఏర్పాటయ్యాక కూడా దీని విషయమై చిత్తశుద్ధితో కృషి చేసిన పాలకులు లేకపోవడంతో ఈ పరిస్థితి తలెత్తిందని విద్యాభిమానులు అంటున్నారు. కాగా 2009లో కాశీరామ్ వీసీగా ఉన్న సమయంలో ఈసీఈ, ఐటీ, సీఎస్ఈ కోర్సులతో ఇంజినీరింగ్ కళాశాల ఏర్పాటు కానున్నట్లు ప్రచారం జరిగింది. తరువాత 2014–15లో ఇన్‌చార్జి వీసీగా పార్థసారథి ఉన్నప్పుడు, 2023లో వాకాటి కరుణ ఇన్‌చార్జి వీసీగా ఉన్నప్పుడు ప్రతిపాదనలు పంపించారు. 2024లో బుర్రా వెంకటేశం ఇన్‌చార్జి వీసీగా ఉన్న సమయంలో డేటా సైన్స్, ఐటీ, సీఎస్ఈ, ఈసీఈ కోర్సులతో ఇంజినీరింగ్ కళాశాల మంజూరు కానున్నట్లు చర్చ జరిగింది. అయితే 2024 ఫిబ్రవరిలో పాలకమండలి కాలపరిమితి ముగియడంతో పాటు, మరోవైపు ఈ ఇంజినీరింగ్ కళాశాల విషయాన్ని వదిలేసి వివాదాస్పద 2014 నియామకాల ఫైల్‌ను ముందుకు తీసుకెళ్లేందుకు ప్రయత్నాలు జరిగాయి. దీంతో కళాశాల విషయం పక్కకు వెళ్లింది. ఈ క్రమంలో తాజాగా ఉమ్మడి కరీంనగర్ జిల్లాలోని శాతవాహన విశ్వవిద్యాలయం పరిధిలోని హుస్నాబాద్‌లో కొత్తగా ఇంజినీరింగ్ కళాశాల మంజూరైంది. పాలమూరు వర్సిటీలో అయితే ఏకంగా రెండు ఇంజినీరింగ్ కాలేజీలు ఉన్నాయి. తెలంగాణ వర్సిటీలో మాత్రం ఇంజినీరింగ్ కాలేజీకు దిక్కు లేకుండా పోయింది. ఓరియంటేషన్ కోర్సులు పెట్టుకోవాలని ముఖ్యమంత్రి చెబుతున్నప్పటికీ తెయూ విషయంలో ఈ దిశగా ఎవరూ ఆలోచన చేయకపోతుండడం గమనార్హం. ప్రస్తుతం తెయూలో ఇంజినీరింగ్ కళాశాల మంజూరు చేస్తే తరగతులు నిర్వహించేందుకు సైన్స్ బిల్డింగ్ సిద్ధంగా ఉంది. కావాల్సింది పాలకుల చిత్తశుద్ధి మాత్రమే.

ఆదిలాబాద్, నిర్మల్ జిల్లాల విద్యార్థులకు అనుకూలం

తెలంగాణ వర్సిటీ పరిధిలో మొదట ఉమ్మడి నిజామాబాద్ జిల్లా మాత్రమే ఉన్నప్పటికీ తరువాత ఉమ్మడి ఆదిలాబాద్, మెదక్ జిల్లాలను కలిపేందుకు నిర్ణయించారు. ఈ నేపథ్యంలో 2012లో ఈ దిశగా అప్పటి ప్రభుత్వం నిర్ణయం తీసుకున్నప్పటికీ మంచిర్యాల జిల్లాకు చెందిన కొందరు నాయకులు అడ్డుకున్నారు. ఉమ్మడి మెదక్ జిల్లా వాళ్లకు హైదరాబాద్‌లోని ఉస్మానియా వర్సిటీ అనుకూలంగా ఉందని, దాని పరిధిలోనే ఉంటామన్నారు. తరువాత తెలంగాణ ఏర్పాటయ్యాక జిల్లాల పునర్విభజన అనంతరం ఆదిలాబాద్, నిర్మల్ జిల్లాలను తెయూలో కలపాల్సి ఉన్నప్పటికీ ఇప్పటివరకు కార్యరూపం దాల్చలేదు.

ఇదిలా ఉండగా ప్రస్తుతం నిర్మల్ జిల్లాకు చెందిన బాసర, భైంసా, నిర్మల్ ప్రాంతాలకు చెందిన అత్యధిక మంది విద్యార్థులు నిజామాబాద్‌లోని గిరిరాజ్ కళాశాలలోనే చదువుతున్నారు. భౌగోళికంగా నిజామాబాద్ జిల్లాకు దగ్గరగా ఉన్న నిర్మల్, ఆదిలాబాద్ జిల్లాలను తెలంగాణ వర్సిటీలో కలపాల్సిన ఆవశ్యకత ఎంతో ఉంది.

వేగవంతంగా ధాన్యం సేకరించాలి

- ఎఫ్‌ఏక్యూపై రైతులకు అవగాహన కల్పించాలి
- కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు
- జక్రాన్‌పల్లి, ఆర్మూర్, మోర్తాడ్‌లో కొనుగోలు కేంద్రాల పరిశీలన



జక్రాన్‌పల్లి మండలం కేశ్‌పల్లిలో రసీదులను పరిశీలిస్తున్న కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు

జక్రాన్‌పల్లి/ పెర్కిట్/ మోర్తాడ్: ధాన్యం కొనుగోళ్లలో వేగం పెంచాలని నిర్వాహకులను కలెక్టర్ రాజీవ్‌గాంధీ హనుమంతు ఆదేశించారు. రైతులకు ఇబ్బంది లేకుండా కొనుగోళ్లు చేపట్టాలని సూచించారు. జక్రాన్‌పల్లి మండలం కేశ్‌పల్లి, ఆర్మూర్ మండలం మంథని, మోర్తాడ్ మండల కేంద్రంలో ఐకేపీ, పీఏసీఎస్‌ల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాలను కలెక్టర్ గురువారం పరిశీలించారు. రైతుల నుంచి సేకరించిన ధాన్యం వివరాలను నిర్వాహకులను అడిగి తెలుసుకున్నారు. కొనుగోలు కేంద్రాల్లోని సదుపాయాలను పరిశీలించారు. అనంతరం రైతులను పలకరిస్తూ.. కొనుగోలు కేంద్రాల్లో ఏమైనా ఇబ్బందులున్నాయా? తూకంలో ఏమైనా తేడాలు ఉంటున్నాయా? అని ఆరా తీశారు. గ్రెయిన్ క్యాలిపర్ ద్వారా నిర్దేశిత ప్రమాణాలకు అనుగుణంగా సన్న ధాన్యం ఉందా లేదా అని కలెక్టరే స్వయంగా పరిశీలించారు. బాగా ఆరబెట్టి, శుభ్రపర్చిన ధాన్యాన్ని తరలించి ప్రభుత్వం ప్రకటించిన మేరకు పూర్తిస్థాయి మద్దతు ధర పొందాలని, సన్నధాన్యానికి అదనంగా క్వింటాలుకు రూ.500 లచొప్పున బోనస్ చెల్లిస్తున్నట్లు పేర్కొన్నారు. తేమ 17 శాతానికి మించకుండా ఎఫ్ఏక్యూ (ఫెయిర్ యావరేజ్ క్వాలిటీ) ప్రమాణాల మేరకు ధాన్యాన్ని కొనుగోలు కేంద్రాలకు తెచ్చేలా రైతులకు క్షేత్రస్థాయిలో అవగాహన కల్పించాలని సంబంధిత అధికారులను కలెక్టర్ ఆదేశించారు. తద్వారా పూర్తిస్థాయిలో రైతులకు మద్దతు ధర అందడమే కాకుండా, రైస్‌మిల్లుల వద్ద ఎలాంటి ఇబ్బందులుండవని హితవు పలికారు. కొనుగోలు కేంద్రాల వద్ద మాయిశ్చర్ యంత్రాలు, టార్పాలిన్లు, వెయింగ్ మెషిన్లను అందుబాటులో ఉంచాలని సూచించారు. అకాల వర్షాలు కురిసేందుకు అవకాశాలు ఉన్నందున వేగవంతంగా ధాన్యం సేకరిస్తూ, నిర్దేశిత రైస్ మిల్లులకు తరలించాలన్నారు. రైస్‌మిల్లుల నుంచి ఎప్పటికప్పుడు ట్రక్ షీట్లు తెప్పించుకొని ట్యాబ్ ఎంట్రీలు చేయాలని ఆదేశించారు. ధాన్యం కొన్న వెంటనే రైతులకు పూర్తి వివరాలతో కూడిన రసీదును తప్పనిసరిగా అందజేయాలన్నారు. కలెక్టర్ వెంట డీఆర్డీవో సాయాగౌడ్, ఆర్డీవో రాజాగౌడ్, డీసీవో ఎన్ శ్రీనివాస్‌రావు, డీఎస్‌వో అరవింద్‌రెడ్డి, సివిల్ సప్లై డీఎం శ్రీకాంత్‌రెడ్డి, తహసీల్దార్లు సత్యనారాయణ, కృష్ణ, ఎంపీడీవోలు తదితరులు ఉన్నారు.



మోర్తాడ్‌లో రైతులతో మాట్లాడుతున్న కలెక్టర్



మంథనిలో ధాన్యాన్ని పరిశీలిస్తూ..

రౌడీషీటర్లపై ప్రత్యేక నిఘా

- మార్పు లేకుంటే పీడీయాక్ట్ అమలు
- సత్ప్రవర్తనతో ఉంటే రౌడీషీట్ ఎత్తేస్తాం
- ఏసీపీ రాజా వెంకట రెడ్డి



కౌన్సెలింగ్ ఇస్తున్న ఏసీపీ రాజావెంకట్‌రెడ్డి

ఖలీల్‌వాడి : రౌడీషీట్ ఉన్నవారిపై పోలీసుల ప్రత్యేక నిఘా ఉంటుందని, రౌడీషీటర్లలో మార్పు రాకుంటే పీడీయాక్ట్ అమలు చేస్తామని ఏసీపీ రాజావెంకట్‌రెడ్డి పేర్కొన్నారు. నగరంలోని ఐదో టౌన్ పోలీస్ స్టేషన్ ఆవరణలో రౌడీషీటర్ల ప్రవర్తనలో మార్పు కోసం గురువారం కౌన్సెలింగ్ నిర్వహించారు. రౌడీషీటర్ల నేర చరిత్ర, వారిపై ఉన్న కేసుల వివరాలు, ప్రస్తుత జీవన విధానం, స్థితిగతులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఏసీపీ మాట్లాడుతూ.. రౌడీషీటర్లు గ్రూపు తగాదాలు, నేరాలలో పాల్గొనవద్దన్నారు. నేరప్రవృత్తిని వీడి కుటుంబ సభ్యులతో కలిసి ఉండాలన్నారు. ఉపాధి పొంది సత్ప్రవర్తనతో ఉంటే రౌడీషీట్ తొలగిస్తామని తెలిపారు. చెప్పుడు మాటలు విని చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడితే జైలుపాలవ్వడం తప్పదన్నారు. రౌడీషీటర్ల ఇళ్ల ను రాత్రి, పగలు తేడా లేకుండా ఎప్పుడైనా తనిఖీ చేస్తామన్నారు. ఏదైనా సమస్య, అపాయం ఉంటే పోలీసులను సంప్రదిస్తే సహాయం అందజేస్తారని సూచించారు. కార్యక్రమంలో నార్త్ రూరల్ సీఐ శ్రీనివాస్, ఎస్సై గంగాధర్, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

అడిగే అధిపతులు లేరు..

నిజామాబాద్ నగరపాలక సంస్థలోని ప్రధాన విభాగాల్లో ఖాళీ పోస్టులతో అభివృద్ధి పనులకు అవరోధాలు ఏర్పడుతున్నాయి. అధికారులు, ఉద్యోగులు బదిలీ అయినా, పదవీ విరమణ పొందినా వారి స్థానంలో కొత్తవారికి పోస్టింగ్ ఇవ్వడం లేదు. కమిషనర్ దిలీప్‌కుమార్ తర్వాత మిగతా ప్రధాన పోస్టులు, విభాగాల అధిపతులు లేకపోవడంతో పురపాలన సక్రమంగా సాగడం లేదు.

బల్దియాలో ప్రధాన పోస్టులు ఖాళీ

- డీసీ, ఏసీ, ఎంహెచ్‌వోల భర్తీ ఎప్పుడో?
- రెవెన్యూ, టౌన్‌ప్లానింగ్, శానిటేషన్‌లో వేధిస్తున్న అధికారుల కొరత
- అవుట్‌సోర్సింగ్ సిబ్బందితోనే పనులు
- గాడితప్పుతోన్న పాలన



నిజామాబాద్ సిటీ : నిజామాబాద్ బల్దియాలో ప్రధాన అధికారి కమిషనర్. ఆ స్థానం తర్వాత డిప్యూటీ కమిషనర్, అడిషనల్ కమిషనర్, మున్సిపల్ వైద్యాధికారి (ఎంహెచ్‌వో), డిప్యూటీ సిటీ ప్లానర్, డిప్యూటీ ఈఈ వంటివి ప్రధానమైన పోస్టులు. కొన్ని నెలలుగా ఈ పోస్టులన్నీ ఖాళీగానే ఉన్నాయి. డిప్యూటీ కమిషనర్ రాజేంద్ర కుమార్, జిల్లా చీఫ్ ప్లానర్ శ్యాంకుమార్ పదవీ విరమణ పొందారు. అడిషనల్ కమిషనర్ ఎన్ శంకర్ బదిలీపై వెళ్లగా, ఎంహెచ్‌వో పోస్టు రెండేళ్లుగా ఖాళీగా ఉంటోంది. టౌన్‌ప్లానింగ్‌లో డీసీపీ, ఏసీపీ, టీపీవో–1, టీపీఎస్–3, టీపీబీవో తదితర పోస్టులు ఖాళీగా ఉన్నాయి. రెవెన్యూ విభాగంలోనూ ఖాళీలు ఉన్నాయి. ప్రధాన పోస్టులన్నీ ఖాళీగా ఉండడంతో ఉన్నవారితోనే నెట్టుకొస్తున్నారు. పర్మినెంట్ ఉద్యోగులు లేకపోవడంతో అవుట్‌సోర్సింగ్ ఉద్యోగులపైనే ఆధారపడాల్సి వస్తుంది. దీంతో పైసలు లేనిదే ఏ ఫైలూ కదలలేని స్థితిలోకి వెళ్లింది. బల్దియా అవినీతికి కేరాఫ్‌గా మారిందంటూ స్థానిక ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ చేసిన బహిరంగ వ్యాఖ్యలే ఇందుకు అద్దం పడుతున్నాయి. ఉన్నతోద్యోగులు లేకపోవడంతోనే పాలన గాడితప్పుతోందన్న చర్చ సాగుతోంది.

అవుట్ సోర్సింగ్ సిబ్బందికే అందలం

రాష్ట్రంలోనే మూడో పెద్ద కార్పొరేషన్ నిజామాబాద్ మున్సిపల్ కార్పొరేషన్. రెండేళ్లుగా ఎంహెచ్‌వోను నియమించలేదు. హోటళ్లు, తినుబండారాలపై తనిఖీలు లేవు. కల్తీ ఆహారంపై, అపరిశుభ్రతపై దృష్టి సారించడం లేదు. శానిటరీ ఇన్‌స్పెక్టర్లు నలుగురూ అవుట్‌సోర్సింగ్‌కి చెందిన వారే. ఇద్దరు పర్మినెంట్ ఉద్యోగుల్లో ఒకరిని డంపింగ్‌యార్డు, ఒకరిని కుక్కల నియంత్రణ విభాగానికి కేటాయించారు. మిగతా విభాగాల్లో అవుట్ సోర్సింగ్ వారే పెత్తనం చెలాయిస్తున్నారన్న ఆరోపణలున్నాయి. టౌన్ ప్లానింగ్ విభాగంపై అవినీతి ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. ముడుపులు ముట్టనిదే పనులు కావడం లేదు. ఆక్రమణలపై చర్యలు లేకపోగా బెదిరింపులకు పాల్పడుతున్నారు. ఈ విభాగానికి అధిపతి పోస్టుతోపాటు టీపీవో పోస్టూ ఖాళీగానే ఉంది. కేవలం ఇద్దరు టీపీఎస్‌లు రాజేంద్రప్రసాద్, రాజేశ్ ఉన్నారు. టీపీఎస్ రాజేంద్రప్రసాద్ డిప్యుటేషన్‌పై ఒకరోజు మాత్రమే విధులు నిర్వహిస్తున్నారు. చైన్‌మన్‌లు కూడా లేరు. ఉన్న ఒకరిద్దరిపైన అక్రమ కట్టడాలను ప్రోత్సహిస్తున్నారని ఇప్పటికే కమిషనర్‌కు పలు ఫిర్యాదులు వెళ్లాయి.

పాతుకుపోయిన సిబ్బంది

బల్దియాలో దాదాపు 1300 మంది వరకు కాంట్రాక్టు పద్ధతిలో ఉద్యోగం చేస్తున్నారు. అధికారులు కేవలం ఫైళ్ల మీద సంతకాలకే పరిమితం కాగా, మిగతా పనులన్నీ కాంట్రాక్టు ఉద్యోగులే చేస్తుంటారు. ప్రతి ఫైలుకు ఇంత అని వసూలు చేసేదీ వారే. ముఖ్యంగా టౌన్‌ప్లానింగ్, రెవెన్యూ, శానిటేషన్ విభాగాల్లో కంప్యూటర్ ఆపరేటర్లుగా చెలామణి అవుతున్న వీరు ఏళ్లుగా ఒకే విభాగంలో పాతుకుపోయారు.

పాలనపై దృష్టి సారిస్తున్నా..



కార్పొరేషన్‌లో చాలా పోస్టులు ఖాళీగా ఉన్నాయి. ఇద్దరు అధికారులు పదవీవిరమణ పొందారు. ఎంహెచ్‌వో పోస్టు కావాలని సీడీఎంఏకు లేఖ రాశాం. అవుట్‌సోర్సింగ్ అధికారుల పనితీరుపై దృష్టిసారించాను. శానిటేషన్‌ను రోజూ పరిశీలిస్తున్నా. త్వరలోనే ప్రక్షాళన ఉంటుంది. – దిలీప్‌కుమార్, కమిషనర్

అకాల వర్షంతో ఆగమాగం

- బోధన్, బాల్కొండ, ఆర్మూర్ నియోజకవర్గాల్లో తడిసిన ధాన్యం
- కల్లాలకు పరుగులు తీసిన రైతులు



ఎడపల్లి మండలం బాపూనగర్‌లో ధాన్యం చుట్టూ చేరిన వర్షపు నీటిని తొలగిస్తున్న మహిళ

డొంకేశ్వర్(ఆర్మూర్) : జిల్లాలోని పలు ప్రాంతాల్లో గురువారం కురిసిన అకాల వర్షం అన్నదాతలను ఆగమాగం చేసింది. మధ్యాహ్నం తర్వాత వాతావరణం ఒక్కసారిగా మారిపోయింది. ఆకాశాన్ని నల్లని మబ్బులు కమ్మేశాయి. అకాల వర్షం భయంతో రైతులంతా కల్లాలకు పరుగులు తీశారు. ఆరబోసిన వడ్లు తడవకుండా కుప్పలపై టర్పాలిన్లు కప్పారు. బోధన్, సాలూర, పోతంగల్, రెంజల్, నవీపేట్, నందిపేట్, డొంకేశ్వర్ మండలాల్లో స్వల్పంగా వర్షం కురిసింది. బలమైన గాలులకు టార్పాలిన్లు ఎగిరిపోయాయి.

బోధన్: బోధన్, సాలూర మండలాల్లో చిరుజల్లులకు కురిశాయి. దీంతో ధాన్యం స్వల్పంగా తడిసింది. ఆరబెట్టిన ధాన్యాన్ని కుప్పలుగా పోసి, టార్పాలిన్లు కప్పేందుకు అవస్థలు పడ్డారు.

ఎడపల్లి(బోధన్) : ఎడపల్లి మండలంలోని వివిధ గ్రామాల్లో వడగళ్ల వాన కురిసింది. వేగంగా వీచిన గాలులకు విద్యుత్ స్తంభాలు విరిగిపడ్డాయి. వర్షంతో అనేకచోట్ల ధాన్యం తడిసిపోయింది.

రెంజల్(బోధన్) : రెంజల్ మండలంలో అరగంటపాటు వాన దంచికొట్టింది. కొనుగోలు కేంద్రాల వద్ద ఉన్న ధాన్యం కుప్పలు తడిసిపోయాయి. ధాన్యం రాశుల చుట్టూ చేరిన నీటిని తొలగించేందుకు రైతులు ఇబ్బందిపడ్డారు. నీలా గ్రామంలో వడగళ్ల వర్షం కురిసింది.

బాల్కొండ : ముప్కాల్ మండల పరిధిలో బుధవారం అర్ధరాత్రి కురిసిన వర్షానికి ఆరబెట్టిన ధాన్యం తడిసిముద్దయ్యింది. గాలి వాన బీభత్సానికి రోడ్లపై, కల్లాల్లో ఆరబెట్టిన ధాన్యం పూర్తిగా తడిసింది.



సాలూరలో టార్పాలిన్లు కప్పుతున్న రైతులు



రెంజల్‌లో ధాన్యం చుట్టూ చేరిన వర్షపునీరు



దత్తాపూర్‌లో వడ్లను కుప్ప చేస్తున్న రైతులు



ఎంఎస్‌సీ ఫారంలో నేలకొరిగిన స్తంభం

క్లుప్తంగా

డిగ్రీ, పీజీ విద్యార్థులకు 'అపార్‌' తప్పనిసరి

తెయూ(డిచ్‌పల్లి): కేంద్ర ప్రభుత్వం యూజీసీ మార్గదర్శకాల మేరకు డిగ్రీ, పీజీ చదువుతున్న విద్యార్థులకు ఆటోమేటెడ్‌ పర్మినెంట్‌ అకౌంట్‌ రిజిస్ట్రీ నెంబర్‌ (అపార్‌ ఐడీ) తప్పనిసరిగా ఉండాలని తెలంగాణ యూనివర్సిటీ రిజిస్ట్రార్‌ యాదగిరి తెలిపారు. తెయూ క్యాంపస్‌లో గురువారం అన్ని అనుబంధ యూజీ, పీజీ కళాశాలల ప్రిన్సిపాల్స్‌, కరస్పాండెంట్లతో సమావేశం నిర్వహించారు. రిజిస్ట్రార్‌ ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. అపార్‌ ఐడీ నమోదు ప్రక్రియను అన్ని అనుబంధ కళాశాలల్లో ఈ నెల 19లోపు పూర్తి చేయాలని సూచించారు. కంట్రోలర్‌ సంపత్‌కుమార్‌, ఎన్‌ఈపీ కోఆర్డినేటర్‌ వాసం చంద్రశేఖర్‌ పాల్గొన్నారు.

తరగతుల బహిష్కరణ

తెయూ(డిచ్‌పల్లి): తెలంగాణ యూనివర్సిటీ అకడమిక్‌ కన్సల్టెంట్లు గురువారం క్యాంపస్‌లోని వివిధ కళాశాలల తరగతులు బహిష్కరించారు. అనంతరం ర్యాలీ, ధర్నా నిర్వహించారు. రాష్ట్ర ఉన్నత విద్యామండలి కార్యాలయాన్ని ముట్టడించిన వివిధ వర్సిటీల అకడమిక్‌ కన్సల్టెంట్లను అరెస్ట్‌ చేయడాన్ని ఖండించారు. జీవో 21ను రద్దు చేసి తమకు న్యాయం చేయాలని డిమాండ్‌ చేశారు.

ధాన్యం కొనుగోళ్లకు ఆటంకం

- అకాల వర్షంతో మందకొడిగా సేకరణ
- మరో రెండ్రోజులు వర్ష సూచన
- ఆందోళనలో రైతాంగం

సుభాష్‌నగర్‌: జిల్లాలో ఊపందుకున్న ధాన్యం కొనుగోళ్లకు అకాల వర్షాలు బ్రేక్‌ వేశాయి. గురువారం సాయంత్రం వర్షం కురవడంతో కల్లాలు, రోడ్లపై ఆరబెట్టిన ధాన్యం తడిసి ముద్దయ్యింది. దీంతో జిల్లావ్యాప్తంగా కొనుగోళ్లు నిలిచిపోనున్నాయి. మరో రెండ్రోజులపాటు వడగళ్లు, ఉరుములు, మెరుపులతో కూడిన వర్షాలు కురుస్తాయని వాతావరణ శాఖ ప్రకటించడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు.

కొనుగోళ్లు ఊపందుకున్న సమయంలోనే..

కొనుగోళ్లు ఊపందుకుంటున్న సమయంలోనే అకాల వర్షాలు ఆటంకంగా మారాయి. అకాల వర్షంతో మరో రెండు, మూడు రోజులపాటు ధాన్యం కొనుగోళ్లకు బ్రేక్‌ పడే అవకాశముంది. గడిచిన పదిరోజుల్లోనే లక్షకుపైనే మెట్రిక్‌ టన్నుల ధాన్యం కొనుగోలు కేంద్రాలకు పోటెత్తింది. దీంతో ధాన్యం సేకరణ మందకొడిగా సాగనున్నాయని సివిల్‌ సప్లై అధికారులు పేర్కొంటున్నారు.

1.05 లక్షల టన్నుల సేకరణ

జిల్లా వ్యాప్తంగా 698 కొనుగోలు కేంద్రాలకు 458



ప్రారంభమయ్యాయి. 309 కొనుగోలు కేంద్రాల ద్వారా ధాన్యం సేకరిస్తున్నారు. 291 కేంద్రాలు సన్నరకం, 18 దొడ్డురకం ధాన్యం సేకరణ కేంద్రాలున్నాయి. 9500 మంది రైతుల నుంచి ఇప్పటికే 1.03 లక్షల మెట్రిక్‌ టన్నుల సన్నరకం, 2వేల మెట్రిక్‌ టన్నుల దొడ్డురకాలను సేకరించి రైస్‌మిల్లులకు తరలించారు.

రూ.70కోట్లకుపైనే చెల్లింపులు..

ధాన్యం రైస్‌మిల్లుకు చేరిన వెంటనే ట్రక్‌ షీట్‌ తీసుకొచ్చి ట్యాబ్‌ ఎంట్రీ పూర్తయిన రెండ్రోజులకే రైతుల ఖాతాల్లో డబ్బులు జమ అవుతున్నాయి. 2,680 మంది రైతులకు చెందిన 30,262 మెట్రిక్‌ టన్నులకు సంబంధించి రూ.70.21 కోట్లకుపైనే రైతుల ఖాతాల్లో ప్రభుత్వం జమ చేసింది. బోనస్‌ డబ్బుల విషయమై సివిల్‌ సప్లై కార్పొరేషన్‌ అధికారుల వివరణ కోరగా, త్వరలోనే జమ అవుతాయని సమాధానమిచ్చారు.

రైతన్నపై అదనపు భారం

ధాన్యం కొనుగోళ్లు ఊపందుకునే సమయంలో అకాల వర్షాలు అన్నదాతను ఆగమాగం చేస్తున్నాయి. జిల్లాకు రెండ్రోజుల రోజుల వర్షసూచన ప్రకటించడంతో రైతులు ధాన్యం తడవకుండా టార్పాలిన్లు అద్దెకు తీసుకొచ్చి కప్పుతున్నారు. ఇదివరకు తడిసిపోయిన ధాన్యాన్ని తేమశాతం కోసం మళ్లీ ఆరబెట్టాల్సి వస్తోంది. దీంతో రైతులపై అదనపు భారం పడనుంది.

గౌరవప్రదమైన జీవనం సాగించాలి



లబ్ధిదారులతో జిల్లా జడ్జి సునీత కుంచాల, కలెక్టర్‌ రాజీవ్‌గాంధీ హనుమంతు, సీపీ చైతన్య

నిజామాబాద్‌అర్బన్‌: వివిధ పరిస్థితుల కారణంగా సమాజంలో దుర్భర స్థితిలో జీవనం సాగిస్తున్న వారు జిల్లా న్యాయ సేవాధికార సంస్థ అందిస్తున్న చేయూతను సద్వినియోగం చేసుకుని గౌరవప్రదంగా జీవించాలని జిల్లా జడ్జి సునీత కుంచాల అన్నారు. జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో గురువారం సాయంత్రం సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయంలో మినీ మోడ్యూల్‌ క్యాంపు నిర్వహించారు. జిల్లా జడ్జితోపాటు కలెక్టర్‌ రాజీవ్‌ గాంధీ హనుమంతు, సీపీ సాయి చైతన్య తదితరులు పాల్గొన్నారు.ఈసందర్భంగా దాతల సహకారంతో పలువురికి కుట్టు మిషన్లు, ప్రభుత్వ బాలికల పాఠశాలలు, డిచ్‌పల్లి మానవతా సదన్‌, కస్తూర్బా విద్యాలయాలకు సానిటరీ నాప్కిన్‌ వెండింగ్‌ మెషీన్లు పంపిణీ చేశారు. లేబర్‌ డిపార్ట్‌మెంట్‌ తరపున అసంఘటిత రంగ కార్మికులకు గుర్తింపు కార్డులను, మెప్మా ఆధ్వర్యంలో 21 స్వయం సహాయక సంఘాలకు రూ. 2.50 కోట్ల విలువ గల బ్యాంకు లింకేజీ రుణాల చెక్కును అందజేశారు. అనంతరం జిల్లా జడ్జి మాట్లాడుతూ.. డీఎల్‌ఎస్‌ఏ ఆధ్వర్యంలో అనేక కార్యక్రమాలు నిర్వహించామని గుర్తు చేశారు. కలెక్టర్‌ మాట్లాడుతూ.. లబ్ధిదారులు చేయూతను సద్వినియోగం చేసుకున్నప్పుడే సేవా కార్యక్రమాలకు సార్థకత చేకూరుతుందన్నారు. సీపీ మాట్లాడుతూ.. లబ్ధిదారులు స్వయం ఉపాధి దిశగా ఆత్మవిశ్వాసంతో ముందుకుసాగాలని పిలుపునిచ్చారు. దాతలను సన్మానించారు. జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి పద్మావతి, హైకోర్టు బార్‌ కౌన్సిల్‌ సభ్యుడు రాజేందర్‌రెడ్డి, నిజామాబాద్‌ బార్‌ అసోసియేషన్‌ అధ్యక్షుడు జగన్మోహన్‌ గౌడ్‌ తదితరులు పాల్గొన్నారు.

'శోభాయాత్ర'ను శాంతియుతంగా నిర్వహించాలి

ఖలీల్‌వాడి: నగరంలో హనుమాన్‌ జయంతి సందర్భంగా నిర్వహించనున్న శోభాయాత్ర, ర్యాలీని శాంతియుతంగా నిర్వహించాలని సీపీ పోతరాజు సాయిచైతన్య సూచించారు. జిల్లా కేంద్రంలోని సీపీ కార్యాలయం కమాండ్‌ కంట్రోల్‌ హాల్‌లో గురువారం హనుమాన్‌ ర్యాలీ నిర్వాహకులు, వివిధ సంఘాలతో ఆయన సమావేశం నిర్వహించారు. సీపీ మాట్లాడుతూ.. ఉత్సవాన్ని భక్తిశ్రద్ధలతో జరుపుకోవాలని, ఇతరులకు ఇబ్బంది కలుగకుండా చూసుకోవాలని సూచించారు. నిబంధనలకు విరుద్ధంగా ప్ర వర్తిస్తే చర్యలు తీసుకుంటామన్నారు. ట్రెయినీ ఐపీఎస్‌ సాయికిరణ్‌ పత్తిపాక, అదనపు పోలీస్‌ కమిషనర్‌ (ఎస్‌బీ) శ్రీనివాస్‌రావు, ఇన్‌చార్జి అదనపు డీసీపీ(అడ్మిన్‌) మస్తాన్‌ అలీ,ఏసీపీ రా జా వెంకట్‌ రెడ్డి,సీఐలు,ఎస్సైలు పాల్గొన్నారు.

నగరంలో ట్రాఫిక్‌ మళ్లింపు..

హనుమాన్‌ జయంతి సందర్భంగా నగరంలో శనివారం ట్రాఫిక్‌ మళ్లింపు ఉంటుందని ట్రాఫిక్‌ ఏసీపీ నారాయణ ఒక ప్రకటనలో తెలిపారు. శనివారం ఉదయం నుంచి రాత్రి వరకు హనుమాన్‌ జయంతి శోభాయాత్ర నిర్వహిస్తారని, కంఠేశ్వర్‌ ఆలయం నుంచి ప్రారంభమై, ఆర్‌ఆర్‌ చౌరస్తా వరకు చేరుకుటుందన్నారు. శోభాయాత్ర వెళ్లే మార్గంలో వాహనదారులు తమ వాహనాలను రోడ్డుపై పార్క్‌ చేయరాదన్నారు.

హైదరాబాద్‌, ఆదిలాబాద్‌, వరంగల్‌ వెళ్లే బస్సులు, వాహనాలు:

ఆర్టీసీ బస్‌ స్టాండ్‌, జెడ్పీ 'ఎక్స్‌' రోడ్డు, నిర్మల హృదయ స్కూల్‌ ముందు నుంచి అంబేడ్కర్‌ కాలనీ, దుబ్బ రోడ్డు, గిరిరాజ్‌ కాలనీ నుంచి బైపాస్‌ రోడ్డు చేరుకోవాలి.

బోధన్‌ వైపు నుంచి:

అర్సపల్లి రైల్వే గేట్‌ నుంచి కొత్త కలెక్టరేట్‌, కంఠేశ్వర్‌ బైపాస్‌, కంఠేశ్వర్‌ టెంపుల్‌ జంక్షన్‌, ఎన్‌టీఆర్‌ చౌరస్తా నుంచి బస్టాండ్‌ చేరుకోవాలి.

బాన్సువాడ వైపు నుంచి:

వర్ని చౌరస్తా నుంచి పులాంగ్‌ సర్కిల్‌, కోర్ట్‌ సర్కిల్‌, ఎన్‌టీ ఆర్‌ చౌరస్తా, రైల్వే స్టేషన్‌ నుంచి ఆర్టీసీ బస్టాండ్‌ చేరుకోవాలి.

'సలహా కమిటీ' లో జిల్లాకు ప్రాధాన్యం

- రూరల్‌ ఎమ్మెల్యే భూపతిరెడ్డితోపాటు, మైనింగ్‌ కార్పొరేషన్‌ చైర్మన్‌ అనిల్‌ను ఎంపిక చేసిన ప్రభుత్వం



భూపతిరెడ్డి, ఈరవత్రి అనిల్‌, సత్యం నారాగౌడ్‌

మోర్తాడ్‌/నిజామాబాద్‌ రూరల్‌: సమగ్ర ఎన్‌ఆర్‌ఐ పాలసీ అమలు, గల్ఫ్‌ బోర్డులను ఏర్పాటు చేసే విషయంలో రాష్ట్ర ప్రభుత్వం అడుగులు ముందుకు వేస్తోంది. ఇందుకోసం రెండేళ్ల పాటు అధ్యాయనం చేయడానికి ఒక సలహా కమిటీని ఏర్పాటు చేస్తూ రాష్ట్ర ప్రభుత్వం గురువారం ఉత్తర్వులను జారీ చేసింది. ఈ కమిటీలో నిజామాబాద్‌ రూరల్‌ ఎమ్మెల్యే భూపతిరెడ్డి, రాష్ట్ర మైనింగ్‌ కార్పొరేషన్‌ చైర్మన్‌ ఈరవత్రి అనిల్‌ను గౌరవ సభ్యులుగా నియమించారు. అలాగే సభ్యుడిగా దుబాయ్‌లో ఉండే జక్రాన్‌పల్లి మండలం కలిగోట్‌వాసి సత్యం నారాగౌడ్‌ సభ్యుడిగా నియమితులయ్యారు. 15 మందితో కూడిన కమిటీలో జిల్లా నుంచి కీలక నేతలకు స్థానం దక్కడం విశేషం. కమిటీ చైర్మన్‌గా మాజీ రాయబారి వినోద్‌ కుమార్‌ను ఎంపిక చేయగా వైస్‌ చైర్మన్‌గా గల్ఫ్‌ వ్యవహారాల విశ్లేషకుడు మంద భీం రెడ్డిని ఎంపిక చేశారు. గౌరవ సభ్యులుగా జిల్లా నేతలను నియమించడంతో ప్రాధాన్యం దక్కిందనే అభిప్రాయం వ్యక్తం అవుతుంది. వలస కార్మికుల సంక్షేమం కోసం సమగ్ర ఎన్‌ఆర్‌ఐ పాలసీని రూపొందించడమా? లేదా గల్ఫ్‌ బోర్డును ఏర్పాటు చేయడమా? ఇందు కోసం అధ్యయనం చేయాలని ప్రభుత్వం కమిటీకి నిర్దేశించింది.

ధాన్యం రక్షణ కోసం రైతుల పాట్లు

రైతులు తమ పంటల(ధాన్యం, పసుపు)ను విక్రయించడానికి నిజామాబాద్‌ వ్యవసాయ మార్కెట్‌ యార్డుకు ఇటీవల పెద్ద ఎత్తున తీసుకువచ్చారు. గురువారం సాయంత్రం వాతావరణం మార్పుల కారణంగా నిజామాబాద్‌ జిల్లాకు అధికారులు ఆరెంజ్‌ అలర్ట్‌ ప్రకటించారు. వర్షంనుంచి పంటను కాపాడుకోవడానికి ముందస్తు జాగ్రత్తగా మార్కెటింగ్‌ శాఖ రైతులకు టార్పాలిన్లను పంపిణీ చేసింది. దీంతో రైతులు పంటలు తడవకుండ టార్పాలిన్లను కప్పుతున్న దృశ్యాలను సాక్షి క్లిక్‌ మనిపించింది.

–సాక్షి స్టాఫ్‌ ఫొటోగ్రాఫర్‌, నిజామాబాద్‌



పసుపు బస్తాలపై కప్పిన టార్పాలిన్లు



ధాన్యం తడవకుండా టార్పాలిన్‌ కప్పుతున్న రైతు

నేడు నిజామాబాద్‌ బార్‌ అసోసియేషన్‌ ఎన్నికలు

ఖలీల్‌వాడి: నిజామాబాద్‌ బార్‌ అసోసియేషన్‌ ఎన్నికలు శుక్రవారం జరుగనున్నాయి. అధ్యక్షుడిగా సీనియర్‌ న్యాయవాది మామిల్ల సాయరెడ్డి ఏకగ్రీవంగా ఎన్నికైన విషయం విదితమే. మిగిలిన పదవులకు ఎన్నికలు జరుగనున్నాయి. రాష్ట్ర బార్‌ కౌన్సిల్‌ ఓటరు జాబితా ప్రకారం దాదాపు 392 మంది న్యాయవాదులు ఓటర్లుగా నమోదు అయ్యారు. ఉదయం 10గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు పోలింగ్‌ కొనసాగుతుందని ప్రధాన ఎన్నికల అధికారి జక్కుల వెంకటేశ్వర్‌ గురువారం తెలిపారు. అదనపు ఎన్నికల అధికారులు ఆర్‌ఎస్‌ఎల్‌ గౌడ్‌, ఎర్రం విగ్నేష్‌, బిట్ల రవి, మధుసూదన్‌ గౌడ్‌ బ్యాలెట్‌ పత్రాల పరిశీలన, పోలింగ్‌ ఏర్పాట్లు చేశారు.

ముగిసిన 'ఎన్‌ఎస్‌ఎస్‌' శిబిరం

తెయూ(డిచ్‌పల్లి): తెలంగాణ యూనివర్సిటీ ఎన్‌ఎస్‌ఎస్‌ యూనిట్‌-1, యూనిట్‌-4 సంయుక్త ఆధ్వర్యంలో డిచ్‌పల్లి మండలం సుద్దపల్లి గ్రామంలో చేపట్టిన వేసవి ప్రత్యేక శిబిరం గురువారం ముగిసింది. ముగింపు కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా హాజరైన రిజిస్ట్రార్‌ యాదగిరి మాట్లాడుతూ.. విద్యార్థులు సేవా దృక్పథం కలిగి ఉండాలన్నారు. వలంటీర్లకు ధ్రువపత్రాలను అందజేశారు. ప్రిన్సిపాల్‌ ప్రవీణ్‌, కో-ఆర్డినేటర్లు రవీందర్‌రెడ్డి, పాత నాగరాజు, మండల స్పెషల్‌ ఆఫీసర్‌ యోహన్‌, ఇన్‌చార్జి ఎంపీడీవో నివేదిత తదితరులు పాల్గొన్నారు.

కిడ్నాపైన బాలిక అప్పగింత

ఖలీల్‌వాడి: నగరంలో ఈనెల 6న కిడ్నాప్‌కు గురైన రమ్య(3) అనే బాలికను తల్లికి అప్పగించినట్లు ఏసీపీ రాజావెంకట్‌ రెడ్డి తెలిపారు. నగరంలోని ఒకటోటౌన్‌ పోలీస్‌ స్టేషన్‌లో గురువారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఏసీపీ మాట్లాడారు. గాంధారి మండలం నర్సాపూర్‌ గ్రామానికి చెందిన శిరీష నగరంలోని నాగారంలో భిక్షాటన చేస్తూ జీవనం సాగిస్తున్నారన్నారు. ఈనెల 6న ఆమె మూడేళ్ల కూతురు రమ్యను తల్లి కొండవ్వ వద్ద వదిలేసి, 8నెలలు కుమారుడు దశరథ్‌ను తీసుకుని భిక్షాటనకు వెళ్లింది. గాంధీచౌక్‌ వద్ద అదేరోజు రాత్రి కొండవ్వ, రమ్య నిద్రించగా మద్నూర్‌ మండలం మీర్జాపూర్‌ గ్రామానికి చెందిన గైక్వాడ్‌ బాలాజీ బాలికను కిడ్నాప్‌ చేసి, సోదరుడైన సూర్యకాంతంకు అప్పగించాడు. వారు బాలికను అమ్మి డబ్బులు సంపాదించాలనుకున్నారు. ఒకటో టౌన్‌ సీఐ రఘుపతి ఆధ్వర్యంలో నాలుగు ప్రత్యేక బృందాలు గాలింపు చేపట్టగా నిందితుడు సూర్యకాంతంను అదుపులోకి తీసుకున్నారు. అలాగే బాలికను తల్లికి అప్పగించినట్లు తెలిపారు. ప్రధాన నిందితుడు బాలాజీ పరారీలో ఉన్నట్లు తెలిపారు. బాలాజీపై ఇదివరకే పలు కేసులు ఉన్నట్లు తెలిపారు. కేసును ఛేదించిన సీఐ రఘుపతి, ఏఎస్‌ఐ షకీల్‌, కానిస్టేబుల్‌ గంగారాం, నితీష్‌, అనంత ప్రభు, వేణుగోపాల్‌, కార్పజీలను ఏసీపీ అభినందించారు.

క్రైం కార్నర్‌

కుంటలో పడి ఇద్దరు బాలురు మృతి

- కామారెడ్డి మండలం క్యాసంపల్లి తండాలో చోటుచేసుకున్న ఘటన



తెజావత్‌ సాయి కుమార్‌ (ఫైల్‌) భుక్యా సురేష్‌ (ఫైల్‌)

కామారెడ్డి క్రైం: ఇద్దరు బాలురు సరదాగా స్నానం చేసేందుకు వెళ్లి కుంటలో మునిగి మృతి చెందారు. వివరాలిలా ఉన్నాయి. కామారెడ్డి జిల్లా క్యాసంపల్లి తండా కు చెందిన తెజావత్‌ సాయి కుమార్‌ (16), భుక్యా సురేష్‌ (15) చదువు మానేసి కొద్ది రోజులుగా దోమకొండ మండలం ముత్యంపేట గ్రామంలోని ఓ కల్లు దుకాణంలో పని చేస్తున్నారు. వారిద్దరూ మంగళవారం సాయంత్రం వరకు కల్లు దుకాణంలో పనులు చేసి బయటకు వెళ్లినట్లు తెలుస్తోంది. గురువారం ఉదయం వారిద్దరి మృతదేహాలు సమీపంలో ఉండే రాఘవాపూర్‌ గ్రామ శివారు లోని ఓ కుంటలో తేలాయి. సమాచారం తెలియగానే కుటుంబ సభ్యులు, బంధువులు, గ్రామస్తులు పెద్ద ఎత్తున కుంట వద్దకు చేరుకున్నారు. దేవునిపల్లి పోలీసులు, ఫైర్‌ సిబ్బంది అక్కడకు చేరుకుని మృతదేహాలను బయటకు తీశారు. ఎస్సై రాజు విచారణ జరిపి మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం కామారెడ్డి జనరల్‌ ఆస్పత్రికి తరలించారు. ఇద్దరి బట్టలు గట్టుపై ఉండటంతో వారిద్దరూ స్నానం చేయడానికి కుంటలోకి దిగి ఉంటారని భావిస్తున్నారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

చెరువులో పడి ఒకరు..

రుద్రూర్‌: పోతంగల్‌ మండల కేంద్రంలోని చెరువులో ఓ వ్యక్తి ప్రమాదవశాత్తు కాలుజారి పడి మృతి చెందినట్టు ఎస్సై సందీప్‌ తెలిపారు. వివరాలు ఇలా.. పోతంగల్‌కు చెందిన బక్కొళ్ల పోశెట్టి (45) వ్యవసాయం చేస్తూ జీవనం సాగించేవాడు. అతడు బుధవారం పొలం వద్దకు వెళ్లి తిరిగి రాలేదు. కుటుంబ సభ్యులు వెతుకుతుండగా గురువారం పోతంగల్‌ చెరువులో మృతదేహం కనిపించింది. బహిర్భూమికి వెళ్లి చెరువులో కాలు జారి నీటిలో పడిపోయి ఉంటాడని మృతుడి భార్య పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈమేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్సై తెలిపారు.

బస్సు కింద పడి వృద్ధురాలు..

కామారెడ్డి క్రైమ్‌: సదాశివనగర్‌ మండలంలోని జనగాం గ్రామంలో ఓ వృద్ధురాలు ప్రమాదవశాత్తు ఆర్టీసీ బస్సు కింద పడడంతో తీవ్రంగా గాయపడగా, ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతిచెందింది. గ్రామస్తులు, పోలీసులు తెలిపిన వివరాలు ఇలా.. జనగాం గ్రామానికి చెందిన పసుపుల లింగవ్వ(75) ఇటీవల లింగంపల్లికి వెళ్లగా తిరిగి సొంతూరు రావడానికి గురువారం ఆర్టీసీ బస్సు ఎక్కింది. జనగాంలో ఆమె బస్సు దిగుతుండగా కండక్టర్‌, డ్రైవర్‌ గమనించలేదు. బస్సు ముందుకు వెళ్లగా, ఆమె అదుపుతప్పి కిందపడంతో వెనక టైరు కాళ్ల పైనుంచి వెళ్లింది. ఈ ఘటనలో ఆమె తీవ్రంగా గాయపడగా స్థానికులు చికిత్స నిమిత్తం నిజామాబాద్‌లోని ఓ ఆస్పత్రికి తరలించారు. అక్కడ ఆమె చికిత్స పొందుతూ మృతిచెందింది. సదాశివనగర్‌ పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు జరుపుతున్నారు.

బైక్‌ చెట్టును ఢీకొనడంతో..

రుద్రూర్‌: పోతంగల్‌ మండలం హంగర్గా శివారులో జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒకరు అక్కడికక్కడే మృతిచెందగా మరొకరికి తీవ్ర గాయలయ్యాయి. స్థానికులు, పోలీసులు తెలిపిన వివరాలు ఇలా.. పోతంగల్‌ గ్రామానికి చెందిన కిరణ్‌(24), అనిల్‌ అనే ఇద్దరు యువకులు గురువారం మోటర్‌ బైక్‌పై హంగర్గా బయలుదేరారు. మార్గమధ్యలో వారికి అడ్డం వచ్చిన కుక్కను తప్పించబోగా బైక్‌ అదుపు తప్పి చెట్టును ఢీకొట్టింది. ఈ ఘటనలో కిరణ్‌ అక్కడికక్కడే మృతి చెందాడు. తీవ్ర గాయలైన అనిల్‌ను స్థానికులు చికిత్స నిమిత్తం బోధన్‌ ప్రభుత్వాస్పత్రికి తరలించారు. సమాచారం అందుకున్న పోలీసులు ఘటన స్థలానికి చేరుకొని వివరాలు సేకరించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు పోలీసులు తెలిపారు.


రోడ్డు ప్రమాదంలో ఒకరికి గాయాలు

నవీపేట: మండల కేంద్రంలోని శివాజీ చౌక్‌ సమీపంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒకరికి తీవ్ర గాయలైనట్లు ఎస్సై వినయ్‌ గురువారం తెలిపారు. తడగామ కాలనీకి చెందిన తోకల గంగాధర్‌ కాలినడక రోడ్డు వెంబడి వెళ్తుండగా వెనుకనుంచి రెంజల్‌ మండలం కళ్యాపూర్‌కు చెందిన ర్యాగట్ల సతీష్‌ బైక్‌పై వేగంగా వచ్చి ఢీకొన్నాడు. ఈఘటనలో గంగాధర్‌కు తీవ్ర గాయాలవడంతో స్థానికులు చికిత్స నిమిత్తం ఆస్పత్రికి తరలించారు. క్షతగాత్రుడి కుమారుడు పోలీసులకు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్నట్లు వారు తెలిపారు.

బైక్‌ అపహరణ

నవీపేట: మండలంలోని నాళేశ్వర్‌ గ్రామంలో ఈనెల 7న ఒకరి బైక్‌ అపహరణకు గురైనట్లు ఎస్సై వినయ్‌ గురువారం తెలిపారు. బాధితుడు హోండా షైన్‌ బైక్‌ను ఆరుబయట పార్కింగ్‌ చేయగా గుర్తు తెలియని దుండగులు ఎత్తుకెళ్లినట్లు పేర్కొన్నారు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

నగరంలో ఆపరేషన్‌ ఛబుత్రా



ఖలీల్‌వాడి: నగరంలోని మూడో టౌన్‌ పోలీస్‌స్టేషన్‌ పరిధిలో బుధవారం రాత్రి 11 గంటల నుంచి రాత్రి 1:30 వరకు ఆపరేషన్‌ ఛబుత్రాను పోలీసులు నిర్వహించారు. ఈక్రమంలో ట్రాఫిక్‌ నిబంధనలు పాటించని 18మంది వాహనదారులను పట్టుకున్నారు. వాహనాలను సీజ్‌ చేసి పోలీస్‌ స్టేషన్‌కు తరలించారు. అలాగే బహిరంగ ప్రదేశాలలో మద్యం తాగుతున్న ముగ్గురిపై పిటీ కేసు నమోదు చేశారు. ఎస్‌హెచ్‌వో రఘుపతి, ఎస్సై హరిబాబు మాట్లాడుతూ.. రాత్రి 10:30 తర్వాత నగరంలో ఎలాంటి షాపులు ఓపెన్‌ చేసినా, రోడ్లు, వీధుల్లో ఎవరైనా సంచరించినా వారిపై చర్యలు తీసుకుంటామన్నారు.

వేర్వేరు కారణాలతో పలువురి ఆత్మహత్య

వేల్పూర్‌: మండలంలోని మోతె గ్రామంలో ఓ వివాహిత ఆత్మహత్యకు పాల్పడింది. ఎస్సై సంజీవ్‌ తెలిపిన వివరాలు ఇలా.. మండలంలోని వెంకటాపూర్‌ గ్రామానికి చెందిన ప్రియాంక(25)కు మోతె గ్రామానికి చెందిన కల్ల భాస్కర్‌తో కొన్నేళ్ల క్రితం వివాహం జరిగింది. వీరికి మూడేళ్ల కుమారుడు ఉన్నాడు. భర్తతోపాటు అత్తమామలు తరచూ ఆమెను వేధించేవారు. గురువారం ఉదయం భర్త, అత్తా, మామ ఆమెతో గొడవపడి ఇంటి నుంచి వెళ్లిపోయారు. దీంతో ప్రియాంక తీవ్ర మనస్థాపం చెంది ఇంట్లో దూలానికి ఉరివేసుకొని ఆత్మహత్యకు పాల్పడింది. ఆమె తండ్రి నడ్పిసాయన్న ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

ఎల్లారెడ్డి మండలంలో..

ఎల్లారెడ్డిరూరల్‌: మండలంలోని లక్ష్మాపూర్‌ గ్రామంలో ఓ వ్యక్తి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఎస్సై మహేష్‌ తెలిపిన వివరాలు ఇలా.. గ్రామానికి చెందిన బోండ్ల నర్సింలు (35) మద్యానికి బానిసై గురు వారం ఇంట్లో ఎవరు లేని సమయంలో ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడినట్లు తెలిపారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్నట్లు పేర్కొన్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఎల్లారెడ్డి ఆస్పత్రికి తరలించినట్లు తెలిపారు.

భిక్కనూరు మండలంలో..



భిక్కనూరు: మండలంలోని పెద్దమల్లారెడ్డి గ్రామంలో ఓ వ్యక్తి ఆత్మహత్య చేసుకున్నారు. పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాలు ఇలా.. గ్రామానికి చెందిన పోచమ్మల నర్సింలు (45) కుటుంబ కలహాలతో విరక్తి చెందాడు. ఈక్రమంలో గురువారం వేకువజామున అతడు తన బంగ్లా పైనుంచి విద్యుత్తు స్తంభం ఎక్కి ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. గ్రామస్తులు వెంటనే పోలీసులకు సమాచారం అందించడంతో ఘటనా స్థలానికి చేరుకొని, వివరాలు సేకరించారు. కేసు నమోదు చేసుకొని, మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కామారెడ్డి ఆస్పత్రికి తరలించారు.

సిరికొండ మండలంలో..

సిరికొండ: మండలంలోని తాటిపల్లి గ్రామంలో ఓ యువకుడు ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఎస్సై రామ్‌ తెలిపిన వివరాలు ఇలా.. గ్రామానికి చెందిన మలావత్‌ అన్వేష్‌ (26) సిరికొండలో ట్రాన్స్‌కో అసిస్టెంట్‌ లైన్‌మెన్‌గా విధులు నిర్వహిస్తున్నాడు. గురువారం మధ్యాహ్నం అతడు ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఫ్యాన్‌కు ఉరివేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. వ్యక్తిగత కారణాలతోనే ఆత్మహత్యకు పాల్పడ్డాడని మృతుడి తండ్రి మదన్‌లాల్‌ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈమేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.



అన్వేష్‌ (ఫైల్‌)

బాలుడి ఆత్మహత్యాయత్నం

రాజంపేట: మండ ల కేంద్రంలో ఓ బాలుడు ఆత్మహత్యకు యత్నించాడు. గ్రామస్తులు, కుటుంబసభ్యులు తెలిపిన వివరాలు ఇలా.. రాజంపేటకు చెందిన కడమంచి స్వామి కుమారుడు శ్రీహరి(17) రూ. 30వేల మొబైల్‌ ఫోన్‌ కొనివ్వాలని ఇంట్లో గొడవ పడ్డాడు. అంత ఖరీదైన మొబైల్‌ కొనే స్థోమత లేదంటూ తండ్రి నిరాకరించాడు. దీంతో మనస్థాపానికి గురైన శ్రీహరి గురువారం ఎలుకల మందు(బిస్కెట్లు) తిన్నాడు. ఈ విషయం తల్లిదండ్రులకు తెలపడంతో వారు వెంటనే అతడిని చికిత్స నిమిత్తం కామారెడ్డి ఏరియా ఆస్పత్రికి తరలించారు. ప్రస్తుతం శ్రీహరి ఆరోగ్యం నిలకడగా ఉందని కుటుంబ సభ్యులు తెలిపారు.

డ్రంకన్‌డ్రైవ్‌ కేసుల్లో పలువురికి జైలు..

రుద్రూర్‌: మండలంలో ఇటీవల పోలీసులు డ్రంకన్‌ డ్రైవ్‌ తనిఖీలు చేపట్టగా రుద్రూర్‌కు చెందిన లక్ష్మణ్‌, రాయకూర్‌ గ్రామానికి చెందిన నగేష్‌ మద్యం తాగి వాహనాలు నడుపుతూ పట్టుబడ్డారు. గురువారం వారిలో బోధన్‌ కోర్టులో హాజరు పర్చగా లక్ష్మణ్‌కు 2రోజుల జైలుశిక్ష, రూ.500 జరిమానా, నగేష్‌కు ఒకరోజు జైలుశిక్ష, రూ.1000 జరిమానాను జడ్జి విధించినట్లు ఎస్సై సాయన్న తెలిపారు.

నగరంలో..

ఖలీల్‌వాడి: నగరంలో ఇటీవల నిర్వహించిన డ్రంకన్‌డ్రైవ్‌ తనిఖీల్లో 9మంది పట్టుబడ్డారు. వారికి గురువారం నగరంలోని ట్రాఫిక్‌ పోలీస్‌స్టేషన్‌లో పోలీసులు కౌన్సెలింగ్‌ నిర్వహించిన అనంతరం కోర్టులో హాజరుపర్చారు. వారిలో ఆరుగురికి రూ. 11వేలు జరిమానా విధించగా, ముగ్గురికి రెండు రోజుల శిక్ష విధించినట్లు పోలీసులు తెలిపారు.

రెంజల్‌ మండలంలో..

రెంజల్‌(బోధన్‌): మండలంలోని సాటాపూర్‌ చౌరస్తాలో పోలీసులు డ్రంకన్‌డ్రైవ్‌ తనిఖీలు చేపట్టగా నలుగురు పట్టుబడ్డారు. గురువారం వారిని కోర్టులో హాజరుపర్చగా ఇద్దరికి రెండు రోజుల జైలు, మరో ఇద్దరికి రూ. 1500 చొప్పున జరిమానాను జడ్జి విధించినట్లు ఎస్సై చంద్రమోహన్‌ తెలిపారు.

ఇందల్వాయి మండలంలో..

ఇందల్వాయి: ఇందల్వాయి పోలీస్‌ స్టేషన్‌ పరిధిలో ఇటీవల పోలీసులు డ్రంకన్‌డ్రైవ్‌ తనిఖీల్లో గన్నారం గ్రామానికి చెందిన దశరథ్‌ పట్టుబడ్డాడు. గురువారం అతడిని పోలీసులు కోర్టులో హాజరుపర్చగా, జడ్జి మూడు రోజుల జైలు శిక్ష విధించినట్లు ఎస్సై మనోజ్‌ తెలిపారు.

ఒకరికి ఐదేళ్ల జైలుశిక్ష

కామారెడ్డి క్రైం/నిజాంసాగర్‌: బాలికపై లైంగిక దాడికి పాల్పడిన కేసులో నేరస్తుడికి కామారెడ్డి కోర్టు ఐదేళ్ల కఠిన కారాగార శిక్ష విధించింది. వివరాలు ఇలా.. నిజాంసాగర్‌ మండలం బూర్గుల్‌ గ్రామానికి చెందిన షేక్‌ షాదు ల్‌ అనే వ్యక్తి 2021 జనవరి 16న ఇంటి బయట ఆడుకుంటున్న ఆరేళ్ల బాలికకు మాయమాటలు చెప్పి లైంగిక దాడికి పాల్పడ్డారు. ఈ విషయాన్ని బాలిక కుటుంబ సభ్యులకు చెప్పడంతో వారు పోలీసులను ఆశ్రయించారు. పోక్సో కేసు నమోదు చేసిన పోలీసులు నిందితుడిని రిమాండ్‌కు పంపారు. కోర్టులో జడ్జి లాల్‌సింగ్‌ శ్రీనివాస్‌ నాయక్‌ విచారణ చేపట్టగా నేరం రుజువైంది. దీంతో నిందితుడికి ఐదేళ్ల కఠిన కారాగార శిక్ష, రూ.2 వేలు జరిమానా విధిస్తూ జడ్జి గురువారం తీర్పు వెల్లడించారు.

కల్తీ కల్లు అమ్మినందుకు ఒకరి రిమాండ్‌

బాన్సువాడ: బీర్కూర్‌ మండలంలోని దామరంచ గ్రామంలో కల్తీ కల్లు తాగి పలువురు అస్వస్థతకు గురికావడంతో కల్లు అమ్మిన ఒకరిని రిమాండ్‌ చేసినట్లు సీఐ రాజేష్‌ గురువారం తెలిపారు. దుర్కి గ్రామానికి చెందిన లక్ష్మాగౌడ్‌, సురేందర్‌గౌడ్‌ల దగ్గర నుంచి కల్లు కొనుగోలు చేసి అమ్మినందుకు దామరంచ గ్రామానికి చెందిన గంగాధర్‌గౌడ్‌ను రిమాండ్‌ పంపించామన్నారు. సిబ్బంది సిబ్బంది శ్రీనివాస్‌,సంగమేశ్వర్‌ ఉన్నారు.

పోక్సో కేసులో నిందితుడు..

మోపాల్‌: మండలంలోని ఓ గ్రామంలో ఇటీవల బాలికపై అత్యాచారానికి పాల్పడిన నిందితుడిని పోలీసులు గురువారం రిమాండ్‌కు తరలించారు. బాధితురాలి కుటుంబీకుల ఫిర్యాదు మేరకు బుధవారం పోక్సో కేసు నమోదైన విషయం తెలిసిందే.

కల్లుదుకాణంపై ఎన్‌ఫోర్స్‌మెంట్‌ దాడులు



ఎడపల్లి(బోధన్‌): మండలంలోని జానకంపేట్‌ గ్రామంలో అనుమతి లేకుండా కల్లు విక్రయిస్తున్న దుకాణంపై ఎన్‌ఫోర్స్‌మెంట్‌ అధికారులు గురువారం దాడులు నిర్వహించారు. అర్సపల్లి గ్రామానికి చెందిన అమర శ్రీనివాస్‌గౌడ్‌ లైసెన్స్‌ లేకుండా కల్లు విక్రయించడంతో కేసు నమోదు చేసి బోధన్‌ ఎక్సైజ్‌ పోలీసులకు అప్పగించారు.దుకాణంలో నిల్వ ఉన్న 350 లీటర్ల కల్లును అధికారులు పారబోసారు. సీఐ స్వప్న,హెడ్‌ కానిస్టేబుల్‌ రాజన్న, కానిస్టేబుళ్లు హమీద్‌, ఉత్తం, శ్యామ్‌, ఆశన్న పాల్గొన్నారు.

వివాహిత అదృశ్యం

రెంజల్‌(బోధన్‌): మండలంలోని నీలా గ్రామానికి చెందిన సుల్తానా అనే వివాహిత అదృశ్యమైనట్లు ఎస్సై చంద్రమోహన్‌ గురువారం తెలిపారు. ఆమెకు సాటాపూర్‌ గ్రామానికి చెందిన యువకుడితో కొన్ని నెలల క్రితం వివాహం జరిగింది. కుటుంబ కలహాలతో ఇటీవల పుట్టింటికి వచ్చింది. ఈ నెల 8న ఆమె స్నేహితురాలిని కలిసి వస్తానని కుటుంబీకులకు చెప్పి ఇంట్లో నుంచి వెళ్లింది. ఇప్పటి వరకు తిరిగిరాకపోవడంతో కుటుంబసభ్యులు చుట్టుపక్కల గాలించారు. అయినా ఆమె ఆచూకీ లభించకపోవడంతో గురువారం పోలీసులకు ఫిర్యాదు చేశారు.